ప్రజా ఫిర్యాదులపై తక్షణమే స్పందించాలి



సాక్షి,సిటీబ్యూరో: ప్రజావాణి కార్యక్రమంలో ప్రజలు అందించిన ఫిర్యాదులను సంబంధిత శాఖల జిల్లా అధికారులు తక్షణమే స్పందించి పరిష్కరించాల జిల్లా రెవెన్యూ అధికారి (డీఆర్ఓ) హరిప్రియ సూచించారు. సోమవారం కలెక్టరేట్‌లో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో ఆమె ప్రజల నుంచి 76 ఫిర్యాదులు స్వీకరించారు. వినతులపై చేపట్టిన చర్యలను వివరిస్తూ ఆన్‌లైన్ పోర్టల్‌లో అప్‌లోడ్ చేయాలని పేర్కొన్నారు. అర్జీలను పెండింగ్‌లో పెట్టకుండా ఎప్పటికప్పుడు పరిశీలించి, పరిష్కరించాలన్నారు. ఇందులో జిల్లా లా–ఆఫీసర్ చంద్రావతి, వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

వికలాంగుల దినోత్సవం



వికలాంగుల దినోత్సవ కార్యక్రమంలో ఎంఈఓ శశిధర్ తదితరులు

కీసర: ప్రపంచ వికలాంగుల దినోత్సవంను పురస్కరించుకొని కీసర ప్రభుత్వ పాథమిక హరిజనవాడలోని భవిత సెంటర్‌లో వికలాంగుల దినోత్సవ వేడుకల్లో ఎంఈఓ శశిధర్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రత్యేక అవసరాలు గల పిల్లల కోసం ప్రభుత్వం అనేక కార్యక్రమాలను నిర్వహిస్తుందన్నారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు జ్యోత్స్న, భవిత సెంటర్ ఐఈఆర్‌పి గ్రేసి, మౌనిక తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా స్వామివారికి రుద్రాభిషేకం



రుద్రహోమంలో ఆలయ చైర్మన్ తటాకం నాగలింగం తదితరులు

కీసర: ప్రజాపాలన ప్రజావిజయోత్సవాల ముగింపు సందర్భంగా ప్రఖ్యాత శైవక్షేత్రమైన శ్రీ భవానీ రామలింగేశ్వర స్వామి దేవస్థానం నందు మహాన్యాస పూర్వక రుద్రాభిషేకం పూజను అర్చకులు కన్నుల పండువగా నిర్వహించారు. అనంతరం రుద్రహోమంలో ఆలయ చైర్మన్ తటాకం నాగలింగం, ఈఓ సుధాకర్‌రెడ్డి, ఫౌండర్ ట్రస్టీలు, భక్తులు తదితరులు పాల్గొన్నారు.

పేదలకు సీఎం రిలీఫ్ ఫండ్ వరం: శ్రీకాంత్‌యాదవ్



జవహర్‌నగర్: ఆపదలో ఉన్న నిరుపేదలకు సీఎం రిలీఫ్ ఫండ్ వరంలాంటిదని జవహర్‌నగర్ కార్పొరేషన్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు మల్లెపూల శ్రీకాంత్‌యాదవ్ అన్నారు. జవహర్‌నగర్ బీజేఆర్‌నగర్‌కి చెందిన దారపోలు హరీష్‌కు సీఎం రిలీఫ్ ఫండ్ నుంచి మంజూరైన రూ.60 వేల చెక్కును సోమవారం మల్లెపూల శ్రీకాంత్‌యాదవ్ చేతులమీదుగా బాధిత కుటుంబ సభ్యులకు అందచేశారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ వేణు, నాయకులు వినయ్‌కుమార్, సతీష్‌గౌడ్, యాదగిరియాదవ్, సాయి, లక్ష్మణ్, రాజుయాదవ్ తదితరులు పాల్గొన్నారు.

సీపీఎం జిల్లా కమిటీ సభ్యుడిగా లక్ష్మణ్

మల్కాజిగిరి: సీపీఎం పార్టీ మేడ్చల్, మల్కాజిగిరి జిల్లా కమిటీ సభ్యుడిగా మల్కాజిగిరికి చెందిన గుంటి లక్ష్మణ్ ఎంపికయ్యారు. ప్రస్తుతం ఆయన మల్కాజిగిరి మండల కార్యదర్శిగా బాధ్యతలు నిర్వహిస్తున్నారు. లక్ష్మణ్ మాట్లాడుతూ.. ప్రజా సమస్యలపై తన వంతు పోరాటం చేసి పరిష్కరించేందుకు కృషి చేస్తానన్నారు.

చికిత్స పొందుతూ.. యువకుడు మృతి

ఘట్‌కేసర్: రోడ్డు ప్రమాదంలో గాయాలై చికిత్స పొందుతున్న ఓ యువకుడు మృతి చెందిన ఘటన ఘట్‌కేసర్ పీఎస్ పరిధిలో జరిగింది. సీఐ పరశురాం తెలిపిన వివరాల ప్రకారం.. యాదాద్రి భువనగిరి జిల్లా బీబీనగర్ మండలం వెంకిర్యాల్ గ్రామానికి చెందిన తంబాల నవీన్‌యాదవ్ (25) నగరంలో ఓ ప్రైవేటు ఉద్యోగి. గత నెల 30న రాత్రి నవీన్‌యాదవ్ తన స్నేహితుడు మెరుగు సాయిచరణ్‌తో కలిసి తన బైక్ (టీఎస్ 30జీ–7942)పై ఘట్‌కేసర్ నుంచి ఇంటికి వెళ్తుండగా.. ఎదులాబాద్ రోడ్డులోని అండర్‌పాస్ వద్ద (టీఎస్ 08 హెచ్‌హెచ్ 1409 నెంబర్) కారు బైకును అతివేగంగా ఢీకొట్టింది. దీంతో నవీన్‌యాదవ్ తల ఇతర శరీర భాగాలకు తీవ్ర గాయాలు కావడంతో చికిత్స నిమిత్తం నగరంలోని గాంధీ ఆసుపత్రికి తరలించారు. ఈ నేపథ్యంలో నవీన్ చికిత్స పొందుతూ సోమవారం మృతి చెందాడు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని కుటుంబీకులకు అప్పగించారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నామన్నారు.

స్కైవాక్ నుంచి దూకేసి..

స్వల్పగాయాలతో బయటపడిన వ్యక్తి

ఉప్పల్: ఉప్పల్ స్కైవాక్ వంతెనపై నుంచి ఓ వ్యక్తి దూకేసిన ఘటన ఉప్పల్ పోలీస్‌స్టేషన్ పరిధిలో సోమవారం చోటు చేసుకుంది. వివరాల ప్రకారం.. సంగారెడ్డి భవానీనగర్ ప్రాంతానికి చెందిన ఎస్‌పి ఫ్రాన్సిస్ (34)స్కైవాక్ ఎక్కి ఉప్పల్ మెట్రోస్టేషన్ వద్దకు చేరుకోగానే అకస్మాత్తుగా కిందకు దూకేశాడు. అదృష్టవశాత్తు అతడు ట్రాఫిక్ బూత్ గొడుగుపై పడి అక్కడి నుంచి కిందకు జారడంతో కాలికి గాయమైంది. సమాచారం అందుకున్న పోలీసులు చికిత్స నిమిత్తం అతడిని ఉప్పల్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి చికిత్స చేయించారు. సదరు వ్యక్తికి మతిస్థిమితం సరిగ్గా లేనట్లుగా వ్యవహరిస్తున్నాడని పోలీసులు చెబుతున్నారు. పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

ఆగని దందా..!



- పుర నిర్మాణాల్లో.. అక్రమాల పరంపర
- పట్టించుకోని కమిషనర్లు.. అడ్డగోలుగా అనుమతులు

సాక్షి, సిటీబ్యూరో: అక్రమ నిర్మాణాలను అడ్డుకునేందుకు ప్రభుత్వం పురపాలికల సంఘాల్లో టీఎస్–బీపాస్ విధానాన్ని ప్రవేశపెట్టినప్పటికీ సంబంధిత అధికారుల అలసత్వం, పలువురి సిబ్బంది చేతి వాటంతో అక్రమాలకు అడ్డుకట్ట పడటం లేదు. ఇంటి నిర్మాణాలు, స్థలాల మార్పిడి కోసం ఆన్‌లైన్‌లో వచ్చిన దరఖాస్తులను పరిశీలించకుండానే అధికారులు అనుమతులు ఇచ్చేస్తున్నారనే ఆరోపణలు వ్యక్తమవుతున్నాయి. ఏడు పురపాలక సంఘాల్లో ఇటీవల విలీనమైన 28 పంచాయతీల్లో మాత్రం నిర్మాణాలు, బహుళ అంతస్తుల భవనాలు, వ్యాపార వాణిజ్య సదుపాయాలకు సంబంధించిన కట్టడాల్లో అక్రమాలు కోకొల్లలుగా చోటు చేసుకుంటున్నాయన్న విమర్శలు ఉన్నాయి. ఆస్తిపన్ను అసిస్‌మెంట్ లెక్కింపులో కూడా తప్పిదాలు జరుగుతున్నాయంటున్నారు. మేడ్చల్–మల్కాజిగిరి జిల్లాలోని 13 పురపాలిక సంఘాల్లో జనవరి నుంచి ఇప్పటి వరకు 4,947 దరఖాస్తులు కాగా, 34 గ్రామ పంచాయతీల పరిధిలో 1,406 వరకు దరఖాస్తులు వచ్చినట్లు తెలుస్తోంది.

నిబంధనలకు తూట్లు..

గతంలో నిబంధనలకు విరుద్ధంగా ఉంటే దరఖాస్తులను అధికారులు తిరస్కరించేవారు. బీపాస్ ద్వారా అన్ని దరఖాస్తులు సులువుగా పరిష్కారమవుతుండటంపై అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. అసిస్‌మెంట్ లెక్కింపులో కొందరు అధికారులు, బిల్డర్లు కొంత వసూళ్లకు పాల్పడుతున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. నిబంధనలు పాటించని ఇళ్లకు కొందరు పర్యవేక్షణాధికారులు ఆమోదం తెలుపుతున్నారన్న విమర్శలు ఉన్నాయి. భారీ భవనాలు, వాణిజ్య సముదాయాలకు కొలతలు తక్కువ చేసి అనుమతులు మంజూరు చేస్తున్నారనే వాదనలు వినిపిస్తున్నాయి. పారదర్శకత కోసం ప్రభుత్వం బీపాస్ తెచ్చినా తెరచాటు అవినీతికి కళ్లెం పడలేకపోతోందనే అభిప్రాయం వ్యక్తమవుతున్నాయి. జిల్లాలో ప్రధానంగా పీర్జాదిగూడ, బోడుప్పల్, నిజాంపేట, కొంపెల్లి, దుండిగల్, దమ్మాయిగూడ, నాగారం, తూముకుంట, మేడ్చల్, జవహర్‌నగర్ పురపాలక సంఘాల్లో ఇష్టానుసారంగా అక్రమణల పరంపర కొనసాగుతోందని స్థానికులు పేర్కొంటున్నారు. అధికారుల పర్యవేక్షణ లేకపోకపోవటంతో టౌన్ ప్లానింగ్‌లోని పలువురు ఉద్యోగులు, సిబ్బంది దోచుకుంటున్నారన్న ఆరోపణలు వ్యక్తమవుతున్నాయి.

పలువురు ప్రతినిధులు, సిబ్బంది పాత్ర..

పురపాలికల్లో ప్రణాళిక, రెవెన్యూ విభాగాల్లో పెద్ద ఎత్తున తప్పిదాలు దొర్లుతున్నాయి. బీపాస్ అమల్లోకి వచ్చాక అవినీతి తగ్గుతుందనుకుంటే.. అక్రమాలు పెరుగుతున్నాయి. 75 నుంచి 120 గజాల్లోపు ఇళ్ల పత్రాలన్నింటినీ క్షుణ్ణంగా పరిశీలించాలి. ఈ వ్యవహారాన్ని పట్టణ ప్రణాళిక విభాగం పర్యవేక్షించాల్సి ఉంటుంది. ఆ తర్వాత ఇంటి కొలతల ఆధారంగా అసిస్‌మెంట్ లెక్కింపునకు యజమానులు దరఖాస్తు చేసుకోవాల్సి ఉంటుంది. నిబంధనల ప్రకారం సెట్‌బ్యాక్ వదలాల్సి ఉంటుంది. క్షేత్రస్థాయిలో యజమానులు అవేమీ పట్టించుకోకుండా ఇష్టానుసారంగా నిర్మాణాలు చేపడుతున్నారు.

అతిక్రమిస్తే...

పురపాలికల్లో అసిస్‌మెంట్ లెక్కింపులో తప్పిదాలకు తావివ్వకుండా జాగ్రత్తలు తీసుకుంటున్నామని సంబంధిత అధికారులు పేర్కొంటున్నారు. బీపాస్ దరఖాస్తులను క్షుణ్ణంగా పరిశీలించాలని పట్టణ ప్రణాళిక అధికారులకు సూచిస్తున్నామంటున్నారు. అన్నీ సక్రమంగా ఉంటేనే అనుమతులు మంజూరు చేస్తున్నామని పేర్కొంటున్నారు. నిబంధనలు అతిక్రమిస్తే పురపాలక చట్టం ప్రకారం సంబంధిత సిబ్బందిపై చర్యలు తీసుకుంటామంటున్నారు.

జంతు జనన నియంత్రణ కేంద్రం ప్రారంభం



జంతు జనన నియంత్రణ కేంద్రాన్ని ప్రారంభిస్తున్న చైర్మన్ కొండల్‌రెడ్డి

పోచారం: నారపల్లిలోని ఎమ్మెస్సార్‌నగర్‌లో ఏర్పాటు చేసిన జంతు జనన నియంత్రణ కేంద్రాన్ని పోచారం మున్సిపల్ చైర్మన్ బోయపల్లి కొండల్‌రెడ్డి సోమవారం ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో కమిషనర్ వీరారెడ్డి, కౌన్సిలర్ గొంగళ్ల మహేష్, నాయకులు శ్రీనివాస్, బాల్‌రెడ్డి, బుచ్చిరెడ్డి, శానిటరీ ఇన్‌స్పెక్టర్ వాణి, వెటర్నరీ డాక్టర్ సుష్మా, మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

ప్రారంభాన్ని అడ్డుకున్న స్థానికులు..

జంతు జనన నియంత్రణ కేంద్రాన్ని తమ ప్రాంతంలో వద్దని స్థానిక మహిళలు ఆందోళన చేశారు. ప్రారంభ కార్యక్రమాన్ని అడ్డుకున్నారు. కేవలం 14 కుక్కల సామర్థ్యంతో ఏర్పాటు చేసిన ఈ కేంద్రంతో ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు ఉండవని చైర్మన్‌తో పాటు పోలీసులు చెప్పారు. ఇదే ప్రాంతంలో కమ్యూనిటీహాలు ఏర్పాటు చేస్తామని చైర్మన్ హామీ ఇచ్చారు. అయినప్పటికీ చైర్మన్ డౌన్ డౌన్ అంటూ నినాదాలు చేశారు. ఇలాంటి పరిస్థితుల్లోనే ప్రారంభ కార్యక్రమం ముగిసింది.

సనాతన ధర్మ పరిరక్షణలో అయ్యప్పలు



అయ్యప్ప పూజలో మాజీ ఎంపీపీ సుదర్శన్‌రెడ్డి

పోచారం: ప్రజల్లో ఆధ్యాత్మిక భావాలు వ్యాప్తి చెందడం ద్వారా శాంతియుత సమాజం ఆవిర్భవిస్తుందని మాజీ ఎంపీపీ ఏనుగు సుదర్శన్ రెడ్డి అన్నారు. సోమవారం నారపల్లిలోని సీతారాముల దేవాలయం వద్ద గురుస్వామి విజయ్ ముదిరాజ్ ఆధ్వర్యంలో మాజీ వార్డు సభ్యుడు గొబ్బిరి మన్యం సౌజన్యంతో అయ్యప్ప పూజ, స్వాములకు అన్నప్రసాద వితరణ జరిగింది. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న సుదర్శన్‌రెడ్డి మాట్లాడుతూ.. సనాతన ధర్మ పరిరక్షణలో అయ్యప్పల భాగస్వామ్యం అభినందనీయమన్నారు. అయ్యప్ప దీక్షతో నిబద్ధత అలవడుతుందన్నారు. మాజీ వార్డు సభ్యులు పర్నాటి బాబు, ఆంజనేయులు, కట్ట నాగేష్, బీజేపీ నాయకుడు సత్యనారాయణ, కాంగ్రెస్ నాయకుడు జ్ఞానేశ్వర్, ప్రధాన అర్చకుడు శివప్రదాస్ శర్మ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా సోనియాగాంధీ జన్మదిన వేడుకలు



సోనియాగాంధీ జన్మదిన వేడుకల్లో.. కేక్ కట్ చేస్తున్న మేయర్ శాంతి తదితరులు

జవహర్‌నగర్: తెలంగాణ రాష్ట్రాన్ని ఇచ్చిన సోనియాగాంధీ చరిత్రలో నిలుస్తారని మేయర్ శాంతి, కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు మల్లెపూల శ్రీకాంత్‌యాదవ్ అన్నారు. సోమవారం సోనియాగాంధీ జన్మదినోత్సవాన్ని పురస్కరించుకొని కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు శ్రీకాంత్‌యాదవ్ ఆధ్వర్యంలో జవహర్‌నగర్ అంబేద్కర్ ప్రధాన చౌరస్తాలో కేక్ కట్ చేసి వేడుకలు జరిపారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్లు లావణ్య సతీష్‌గౌడ్, వేణు, నాయకులు వినయ్‌కుమార్, భాస్కర్, సాయికృష్ణ, లక్ష్మణ్, శ్రీనివాస్, రాజుయాదవ్, కృష్ణ, సునీత, అనంతలక్ష్మీ తదితరులు పాల్గొన్నారు.

ఫస్ట్‌ఎయిడ్ సేవలకు మాత్రమే పరిమితం కావాలి



సాక్షి,సిటీబ్యూరో: ఫస్ట్ ఎయిడ్ సెంటర్ సేవలకు మాత్రమే తమ క్లినిక్‌లను ఆర్‌ఎంపీలు వినియోగించుకోవాలని జిల్లా వైద్యారోగ్యశాఖ అధికారి డా. రఘునాథ్‌స్వామి కోరారు. సోమవారం కలెక్టరేట్‌లోని డీఎంహెచ్‌ఓ కార్యాలయం హాలులో జిల్లా గ్రామీణ వైద్య ప్రాక్టీషనర్లతో ఆయన సమావేశాన్ని నిర్వహించారు. యాంటీబయోటిక్ ఇంజెక్షన్లు, స్టెరాయిడ్లు, నొప్పి నివారణ వంటి మందులు ఇచ్చే అనుమతి లేదని స్పష్టం చేశారు. తమ క్లినిక్‌లను 'ఫస్ట్ ఎయిడ్ క్లినిక్స్' అనే బోర్డులతో అమర్చాలని ఆదేశించారు. నిబంధనలు ఉల్లంఘించిన నకిలీ వైద్యులుపై క్లినికల్ ఎస్టాబ్లిష్‌మెంట్ చట్టం కింద కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. జాతీయ వైద్య కమిషన్, తెలంగాణ మెడికల్ కౌన్సిల్ నిర్వహించే తనిఖీల్లో పూర్తి సహకారం అందించాలని ఆదేశించారు. నిబంధనలు పాటించకపోతే క్లినిక్స్ మూసివేత చర్యలు ఉంటాయని హెచ్చరించారు. ప్రజల ప్రాణాలతో చెలగాటం ఆడితే.. జిల్లా ఆరోగ్య వైద్య, కుటుంబ సంక్షేమశాఖ ఉపేక్షించబోదన్నారు. అర్‌ఎంపీలపై అవసరమైతే చట్ట రీత్యా కేసు నమోదు చేసి కఠినంగా శిక్ష పడేలా చూస్తామని హెచ్చరించారు.

బయోలాజికల్ సైన్స్ టాలెంట్ టెస్ట్

శామీర్‌పేట్: తూంకుంట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో సోమవారం మండల స్థాయి బయోలాజికల్ సైన్స్ టెస్ట్ నిర్వహించారు. ఈ పరీక్షల్లో శామీర్‌పేట, మూడుచింతలపల్లి మండలాల్లోని వివిధ పాఠశాలల విద్యార్థులు పాల్గొన్నారు. ఇంగ్లీష్, తెలుగు భాషల్లో నిర్వహించిన ఈ పరీక్షల్లో ఉత్తమ ప్రతిభ కనబర్చిన విద్యార్థులకు బహుమతులతో పాటు జ్ఞాపికలను అందజేశారు. కార్యక్రమానికి ఇన్‌చార్జి ప్రధానోపాధ్యాయులు అన్నపూర్ణ, బయోలాజికల్ సైన్స్ ఫోరం జిల్లా ప్రధాన కార్యదర్శి తిరుమలేష్ తదితరులు హాజరయ్యారు.

రాష్ట్ర ఉత్తమ వైద్యాధికారి శ్రీదేవికి ఘన సత్కారం



సాక్షి,సిటీబ్యూరో: రాష్ట్ర టీబీ శిక్షణ, ప్రదర్శన కేంద్రం నిర్వహించిన కార్యక్రమంలో ఉత్తమ కార్యక్రమాధికారిగా పురస్కారాన్ని అందుకున్న డాక్టర్ శ్రీదేవిని జిల్లా వైద్య ఆరోగ్య అధికారి డాక్టర్. రఘునాథ్‌స్వామి అభినందించారు. ఈ మేరకు సోమవారం కలెక్టరేట్‌లోని డీఎంహెచ్‌ఓ కార్యాలయంలో ఆయన ఘనంగా సన్మానించారు. డాక్టర్ శ్రీదేవి అందుకున్న పురస్కారం జిల్లా ఆరోగ్య, వైద్య, కుటుంబ సంక్షేమ విభాగానికి గర్వకారణమని తెలిపారు. మేడ్చల్ జిల్లా వైద్యవిభాగానికి సంబంధించి అన్నీ అంశాల్లో రాష్ట్రంలో మొదటి స్థానంలో నిలవాలని ఆశిస్తున్నట్లు తెలిపారు. వైద్యాధికారులు, సిబ్బంది ఇలాంటి పురస్కారాలను తీసుకురావడానికి కృషి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో డాక్టర్లు, వైద్యాధికారులు పద్మావతి, సరస్వతి, చంద్రకళ, మంజులారెడ్డి తదితరులు పురస్కార గ్రహీత డాక్టర్ శ్రీదేవిని అభినందించారు.

అక్రమ నిర్మాణాలపై హైడ్రా కమిషనర్‌కు ఫిర్యాదు

పోచారం: పోచారం మున్సిపాలిటీ పరిధిలో జరుగుతున్న అక్రమ నిర్మాణాలపై హైడ్రా కమిషనర్ రంగనాథ్‌కు వైస్‌చైర్మన్ రెడ్యానాయక్ సోమవారం ఫిర్యాదు చేశారు. పోచారంలోని సర్వే నెంబర్ 27లో రాంకీ సంస్థ ప్రభుత్వ స్థలంతో పాటు నాలాను కబ్జాచేసి గేటెడ్ కమ్యూనిటీ నిర్మిస్తున్నట్లు ఫిర్యాదులో పేర్కొన్నారు. యంనంపేట్‌లోని సర్వే నెంబర్లు 92–95, 123, 124లో బొంతుకుంట వాగును కబ్జాచేసి వెంచర్ చేశారని తెలిపారు. యంనంపేట్‌లోని సర్వే నెంబర్ 90లో పార్కు స్థలాన్ని కబ్జాచేసి ఓ రియల్ ఎస్టేట్ వ్యాపారి రోడ్డు వేశారన్నారు. నిబంధనలకు విరుద్ధంగా సెల్లార్ల తవ్వకాలు జరుగుతున్నాయని పేర్కొన్నారు. ఇప్పటికైనా అక్రమ నిర్మాణాలపై అధికారులు చర్యలు తీసుకోవాలని కోరారు.

క్రైస్తవుల సంక్షేమానికి కృషి చేస్తా..

మల్లాపూర్: క్రైస్తవుల సంక్షేమానికి తనవంతు కృషి చేస్తానని ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి అన్నారు. మల్లాపూర్ బేతస్థ హౌస్ ఆఫ్ ప్రేయర్ ఆధ్వర్యంలో ప్రీ క్రిస్మస్ గాస్పెల్ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి ముఖ్యఅతిథిగా ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి, మల్లాపూర్ కార్పొరేటర్ పన్నాల దేవేందర్‌రెడ్డి హాజరై మాట్లాడారు. పాస్టర్లు ఎబినేజర్, బీదర్ దేవదాసు, జాషువా, స్థానిక నేతలు పీఆర్, ప్రవీణ్, శ్రీనివాస్‌రావు, రాపోలు శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

ముందస్తు అరెస్టులు



పోలీసుల అదుపులో ముదిరాజ్ మత్స్యకార్మికులు

ఘట్‌కేసర్: మత్స్యకారుల సహకార సంఘం మేడ్చల్ జిల్లా అధ్యక్షుడు మన్నె రాజుముదిరాజ్ పిలుపు మేరకు 'చలో అసెంబ్లీ' కార్యక్రమంలో భాగంగా ఎదులాబాద్ ముదిరాజ్ మత్స్యకార్మికులను సోమవారం ముందస్తు అరెస్ట్ చేశారు. చల్లో అసెంబ్లీలో పాల్గొనకుండా ఎదులాబాద్ నాయకులు లింగంముదిరాజ్, బాలరత్నం ఇతర నాయకులను అరెస్ట్ చేసి పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. అనంతరం వ్యక్తిగత పూచికత్తుపై విడుదల చేశారు.

ముందస్తు అరెస్టులు అప్రజాస్వామికం..

చలో అసెంబ్లీ కార్యక్రమం విఘాతం కల్పించాలని పోలీసులు జిల్లాలోని ముదిరాజ్ నాయకులను ముందస్తు అరెస్ట్ చేయడం అప్రజాస్వామికమని ముదిరాజ్ ఎంప్లాయిస్ అండ్ ప్రొఫెషనల్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు పులి దేవేందర్‌ముదిరాజ్ అన్నారు. ఘట్‌కేసర్‌లో సోమవారం ఆయన మాట్లాడుతూ.. హక్కులు కోసం పోరాడుతున్న ముదిరాజ్‌లను అరెస్ట్ చేయడం అన్యాయమని, మత్స్యకార్మికుల హక్కుల కోసం పోరాటం చేస్తామని ప్రభుత్వాన్ని హెచ్చరించారు.

పారిశుద్ధ్యానికి ప్రత్యేక చర్యలు



ప్రత్యేక పారిశుద్ధ్యంలో కార్పొరేటర్ వెంకటేష్‌యాదవ్

బోడుప్పల్: పారిశుద్ధ్య నిర్వహణకు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నామని 23వ డివిజన్ కార్పొరేటర్ రాసాల వెంకటేష్‌యాదవ్ అన్నారు. బోడుప్పల్‌లో ప్రజాపాలన విజయోత్సవాల్లో భాగంగా శనివారం వాసవీనగర్ కాలనీలో నిర్వహించిన పారిశుద్ధ్య స్పెషల్ డ్రైవ్ కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. డివిజన్ పరిధిలో అన్ని రకాల మౌలిక వసతులను కల్పిస్తున్నట్లు వివరించారు. తాగునీరు, రోడ్లు, అండర్ గ్రౌండ్ డ్రైనేజీ, పారిశుద్ధ్యం, విద్యుత్‌కు ప్రాధాన్యతనిచ్చినట్లు పేర్కొన్నారు. శానిటరీ ఇన్‌స్పెక్టర్ నారాయణరెడ్డి, వాసవీనగర్ కాలనీ అధ్యక్షులు మోహన్‌బాబు, ప్రధాన కార్యదర్శి క్రాంతికుమార్, నాయకులు సహోదర్ రెడ్డి, కృష్ణారెడ్డి, శివయాదవ్ తదితరులున్నారు.

ఎమ్మెల్యే మల్లారెడ్డి చౌకబారు విమర్శలు మానుకోవాలి



వంతెన పనుల వివరాలు తెలుసుకుంటున్న వజ్రేశ్‌యాదవ్ తదితరులు

ఘట్‌కేసర్: దశాబ్దాకాలంగా అధికారంలో ఉన్న ఎమ్మెల్యే మల్లారెడ్డి రైల్వే వంతెన పనులు పూర్తి చేయకుండా అధికారం కోల్పోగానే ప్రభుత్వంపై విమర్శలు చేయడం మానుకోవాలని టీపీసీసీ ఉపాధ్యక్షుడు వజ్రేశ్‌యాదవ్ అన్నారు. పట్టణంలో నిర్మిస్తున్న రైల్వే వంతెన పనులను మాజీ ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి, మున్సిపల్ చైర్‌పర్సన్ పావనీజంగయ్య, బీ–బ్లాక్ అధ్యక్షుడు మహేష్‌గౌడ్‌తో కలిసి సోమవారం పరిశీలించారు. అనంతరం వారు మాట్లాడుతూ.. పదేళ్ల అధికారంలో ఉన్న మల్లారెడ్డి వంతెన గురించి పట్టించుకోలేదని, ప్రస్తుతం ప్రజలను తప్పుదోవ పట్టిస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఏప్రిల్ వరకు వంతెన పనులు పూర్తి చేయిస్తామన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ మున్సిపల్ అధ్యక్ష ప్రధాన కార్యదర్శి ముత్యాలుయాదవ్, రాధాకృష్ణముదిరాజ్, నాయకులు పాల్గొన్నారు.

పేదలందరికీ సంక్షేమ ఫలాలు అందాలి



ఎమ్మార్వో ఆఫీస్ వద్ద దీక్ష చేస్తున్న ధర్మ సమాజ్ పార్టీ నేతలు

మేడిపల్లి: అర్హులైన నిరుపేదలకు ఉచిత విద్య, వైద్యం అందించడంతో పాటు ఇళ్లు, భూమి అందించి ఉపాధి అవకాశాలను కల్పించాలని డిమాండ్ చేస్తూ.. ధర్మ సమాజ్ పార్టీ ఆధ్వర్యంలో మేడిపల్లి మండల ఎమ్మార్వో ఆఫీస్ వద్ద సోమవారం రిలే నిరాహార దీక్ష చేశారు. ఈ సందర్భంగా మేడిపల్లి మండల కన్వీనర్ పారునంది వెంకేర్ మాట్లాడుతూ.. ధర్మ సమాజ్ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు డా.విశారదన్ మహారాజ్ పిలుపు మేరకు రిలే దీక్షలు నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. జనాభాలో 90 శాతం ఉన్న బీసీ, ఎస్సీ, ఎస్టీలు ఆర్థిక అసమానతలు తొలగి బలపడతారన్నారు. ఈ ఐదు డిమాండ్లను సామాన్యులకు అందేలా ప్రభుత్వాలు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. లేదంటే ఆమరణదీక్షకు సైతం దిగుతామని హెచ్చరించారు. ధర్మ సమాజ్ పార్టీ మేడిపల్లి మండల కో– కన్వీనర్ ఆడాల కుమార్, మండల సభ్యులు కళ్లేపల్లి మోహన్, మేడ్చల్ జిల్లా కో–కన్వీనర్ శివకుమార్, మహిళా సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

అక్రమ నిర్మాణాలను తొలగించిన మున్సిపల్ అధికారులు





జేసీబీతో ఆక్రమణల తొలగింపు

మేడ్చల్: ఆక్రమణలతో ఇరుకుగా మారిన మేడ్చల్ మార్కెట్ రోడ్డులో ఆక్రమణలను మున్సిపల్ అధికారులు సోమవారం తొలగించారు. జేసీబీలు, సిబ్బంది సహాయంతో వివేకానంద విగ్రహం నుంచి మార్కెట్ వరకు రోడ్డులో ఉన్న ఆక్రమణలను అధికారులు తొలగించారు. మార్కెట్ రోడ్డును వివేకానంద విగ్రహం నుంచి పెద్ద చెరువు వరకు అభివృద్ధి చేయాలని ట్రాఫిక్ పోలీసులు, మున్సిపల్ అధికారులు సూచించడంతో మున్సిపల్ అధికారులు ఆక్రమనలను తొలగించేందుకు సోమవారం శ్రీకారం చుట్టారు. మార్కెట్ రోడ్డులో దుకాణాల ముందు రోడ్డుపై మెట్లు నిర్మించడం, షెడ్లు వేయడం వంటివి చేయడంతో రోడ్డు ఇరుకుగా మారింది. దీంతో అధికారులు జేసీబీల సహాయంతో ఆక్రమణలను పూర్తిగా తొలగించారు. మరో రెండు రోజుల పాటు ఆక్రమణలను పూర్తిగా తొలగించి, రోడ్డును విస్తరణ చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకువస్తామని కమిషనర్ నాగిరెడ్డి తెలిపారు.

జేసీబీ డ్రైవర్‌పై చేయిచేసుకున్న కౌన్సిలర్..

రోడ్డుపై ఉన్న ఆక్రమణలను తొలగించే క్రమంలో మహావీర్ చౌరస్తా వద్ద ఉన్న కౌన్సిలర్ మర్రి శ్రీనివాస్‌రెడ్డి భవనం వద్ద ఆక్రమణలను జేసీబీతో తొలగించారు. కౌన్సిలర్ శ్రీనివాస్‌రెడ్డి అక్కడకు చేరుకుని తాను ఎలాంటి ఆక్రమణలు చేయకున్నా ఎందుకు కూల్చివేశారని అధికారులను నిలదీశారు. దీంతో అధికారులకు కౌన్సిలర్‌కు వాగ్వివాదం చోటు చేసుకుంది. అక్రమంగా రోడ్డును ఆక్రమించి అక్రమ నిర్మాణాలను చేసిన వాటిని తొలగించడంతో మేడ్చల్ మార్కెట్‌లో సోమవారం కాసేపు ఉద్రిక్తత పరిస్థితి నెలకొంది. ఆక్రమణల తొలగింపు పూర్తయితే మార్కెట్‌లో వాహనదారులకు కష్టాలు తీరుతాయి.